ప్రజాశక్తి
శనివారం 20 సెప్టెంబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు



వైద్య సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కిల్లోగుడ ప్రాథమిక కేంద్రంలో విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన బదిలీ అయిన హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఎంపిహెచ్ఎస్, హెల్త్ సూపర్వైజర్లతో పాటు మిగిలిన వైద్య సిబ్బందికి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు నజీర్, కుమార్ రత్న మాట్లాడుతూ ఈ పీహెచ్సీలో ఏ విధంగా విధులు నిర్వహించారో అదేవిధంగా బదిలీపై వెళ్లిన పీహెచ్సీలో కూడా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఓ సంజీవ్, ఎంపిహెచ్ఎస్ జానకి, హెచ్వి పుష్ప, హెల్త్ అసిస్టెంట్లు ఎస్ ప్రభాకర్, స్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సత్కరిస్తున్న సిబ్బంది

హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా..

కదంతొక్కిన ఆదివాసీలు

- ప్రాజెక్టులు రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్
- అరకులోయలో భారీ ర్యాలీ, తహశీల్దార్ కార్యాలయం ముట్టడి
- కార్పొరేట్ కంపెనీల కోసం తమను బలిచేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక



సంప్రదాయ విల్లంబులు ఎక్కుపెట్టిన నాయకులు, గిరిజనులు




వేలాదిగా తరలి వచ్చిన గిరిజనులు

ప్రజాశక్తి - అరకులోయ, అరకులోయ రూరల్ : హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఒప్పందాన్ని రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స హెచ్చరించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా అరకులోయ మండల కేంద్రంలో శుక్రవారం ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలు గ్రామాల నుంచి ఒక్కసారిగా వేలాదిమంది వివిధ తరలి రావడంతో అరకులోయ పట్టణం అంతా జన సందోహంతో కిక్కిరిసిపోయింది. స్థానిక ఎన్టీఆర్ గ్రౌండ్ నుంచి పోలీస్ స్టేషన్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ, హైడ్రో పవర్ ప్రాజెక్టులతో 250 గ్రామాలు మునిగిపోతాయన్నారు. చట్టాన్ని కాపాడవలసిన ముఖ్యమంత్రి ఆగస్టు 9న ప్రవేట్ వారితో ఒప్పందం చేసుకున్నట్లు ప్రకటించడం దారుణమన్నారు. ఈ ఒప్పందాలు వెంటనే రద్దు చేయకపోతే ఈనెల 25న మజ్జివలసలో భారీ బహిరంగ నిర్వహించి పోరాటం ఉధృతం చేస్తామన్నారు. మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కారు చౌకగా ఏజెన్సీ ప్రాంతాన్ని అమ్మడం బాధాకరమన్నారు. గిరిజనులకు పోడు భూములకు పట్టాలివ్వడానికి ముందుకు రాని పవన్ కళ్యాణ్ అడవులు ప్రైవేట్ కంపెనీలకు ఇవ్వడానికి ఎలా వస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఇక్కడి గిరిజనులకు రగ్గులు, , చెప్పులు పంచి అడవులు మాత్రం అదానికి, నవయుగ కంపెనీలకు ఇస్తున్నారన్నారు. గిరిజనులకు పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు తమకు అనుమతి ఇస్తూనే మరోపక్క అక్రమ కేసులు బనాయిస్తున్నారని దుయ్యబట్టారు. తమపై పెట్టిన కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులతో 50 వేల మంది జల సమాధి అవుతారన్నారు. ఈ ఉద్యమానికి రాజకీయాలకు అతీతంగా రాజకీయ పార్టీలు పాల్గొని గిరిజన ప్రాంతాన్ని పరిరక్షించుకోవాలని ఆయన కోరారు.

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో గ్రామాలకు అధికారులు ఎవరైనా వస్తే తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో సాంప్రదాయ ఆయుధాలతో ప్రతిఘటించాలని ఆయన అన్నారు. అసెంబ్లీలో రద్దు తీర్మానం చేయకపోతే నాయకులను గ్రామాలకు రానివ్వబోమని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అన్యాయం చేయడాన్ని చెబుతున్న టిడిపి నాయకులు జీవో 51 విడుదల చేస్తే ఆ పార్టీ నాయకులు ఎందుకు ఊరుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రెస్ మీట్లు మాని ప్రత్యక్ష పోరాటానికి రావాలన్నారు. లేకపోతే ప్రజలు తిరగబడి రోజులు మొదలైంది అన్నారు. తక్షణమే హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలన్నారు.

అనంతగిరి జెడ్పిటిసి డి.గంగరాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ నాయకులు సూపర్ సిక్స్ పేరుతో, అభివృద్ధి చేస్తుందంటే హైడ్రో పవర్ ప్రాజెక్టుల పేరుతో ముంచుతుందన్నారు. పెద కోటలో డ్యామ్ కడితే రైవాడ జలాశయం ఉండదని, చంపవతి నదులు ఎండిపోతాయన్నారు. ప్రజా ప్రతినిధులు అమ్ముడుపోతే తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గిరిజన మంత్రి సంధ్యారాణి తమ ప్రాంతంలో ఉన్న హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయించుకొని మౌనం దాల్చిస్తే ఊరుకోరని ఆయన హెచ్చరించారు.

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టులతో 20వేల ఎకరాల జిరాయితీ భూమి, వందల ఎకరాల కాఫీ తోటలు నాశనం అవుతాయన్నారు. అనంతరం తహశీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు, సర్పంచులు ఎంపీటీసీలు వి ఉమామహేశ్వరరావు, రామారావు, బుజ్జి బాబు, దశరథ్, చిన్న బాబు, రామన్న, రమేష్, నోబో, హైమా, నాగేశ్వరరావు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న నేతలు అప్పలనర్స, సురేంద్ర, గంగరాజు, తదితరులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పిడి ఝాన్సీరాం పడాల్

అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం

- ఐసిడిఎస్ పీడీ ఝాన్సీరాంపడాల్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: అంగన్వాడి కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు అల్లూరి జిల్లా ఐసిడిఎస్ పిడి ఝాన్సీరాం పడాల్ తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్రీయ పోషన్ మాసోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. రాజవొమ్మంగిలో గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద స్థానిక సిడిపిఒ సుజాత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో 3,314 అంగన్వాడి కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అంగన్వాడి కేంద్రాల ద్వారా సరుకులు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ వాటిని లబ్ధిదారులు సక్రమంగా వినియోగిస్తున్నదీ లేనిదీ ఆరా తీశారు. ఈ సందర్భంగా తృణధాన్యాలతో ఏర్పాటు చేసిన గర్భిణి చిత్రం ఆకట్టుకుంది. అనంతరం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల బాల్యవివాహాలు జరిగిన వారిలో 247 మంది గర్భిణులను గుర్తించామని, వారందరూ పాఠశాల విద్య మధ్యలో ఆపేసిన వారేనని బాల్య వివాహాల నివారణకు గ్రామస్థాయిలో ప్రత్యేక కమిటీలు వేసి ప్రతి శుక్రవారం ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లపూడి రమణి, ఎపిఐఐసి డైరెక్టర్, ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజు, ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి సంధ్య, మహిళా పోలీసులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డేవిడ్‌రాజ్

రహదారి పనుల పరిశీలన

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ మారుమూల గ్రామమైన మునసపల్లి గ్రామానికి నిర్మిస్తున్న రహదారి కనెక్టివిటీ పనులను శుక్రవారం గిరిజన సంక్షేమ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డేవిడ్‌రాజ్ పరిశీలించారు. వలసగెడ్డ కొత్తూరు గ్రామ సమీప ప్రధాన ఆర్‌అండ్‌బి రహదారి నుంచి వలసగెడ్డ వలసపల్లి, మునసపల్లికి 2024-25లో ఉపాధిపనుల్లో భాగంగా 6 కిలోమీటర్లు రహదారి నిర్మించేందుకు 5 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రహదారి, కల్వర్టు పనులు వేగవంతం చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గిరిజన సంకేమ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జి ఆర్ నాయుడు ఇంజనీరింగ్ అసిస్టెంట్ పరమేశు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి

- వైసిపి నేతల ర్యాలీ, బైఠాయింపు

ప్రజాశక్తి-పాడేరు:మెడికల్ కళాశాలల ప్రయివేటీ కరణపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు శుక్రవారం పాడేరులో వైసీపీ నేతలు పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెడికల్ కళాశాల వద్దకు తరలి వెళ్లారు. వైయస్సార్ సిపి అల్లూరి జిల్లా అధ్యక్షుడు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు అధ్యక్షతన అరకు ఎంపీ డాక్టర్ తనూజ రాణి విశాఖ ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్పర్సన్ సుభద్ర, అరకు మాజీ ఎంపీ మాధవి మాజీ జిసిసి చైర్మన్ శోభా స్వాతి రాణి, ఉమ్మడి జిల్లా వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి శెట్టి పాల్గుణ, అదీప్ రాజు, వాసుపల్లి గణేష్ కుమార్ తదితరులు మెడికల్ కళాశాల వద్ద బైఠాయింపు జరిపారు. "యువజన విద్యార్థి" విభాగాల ఆధ్వర్యంలో పాడేరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి మెడికల్ కాలేజ్ వద్ద పెద్ద ఎత్తున వైసీపీ నాయకులు పాల్గొని నిరశన కార్యక్రమం చేపట్టారు. శాసన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ, 17 మెడికల్ కాలేజీలను సీఎం చంద్రబాబు నాయుడు ప్రైవేటీకరణ చేస్తే సహించబోమని, దీన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. చేతనైతే మెడికల్ కాలేజీలు పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు కె.కె. రాజు, విశాఖ ఈస్ట్ సమన్వయకర్త మొల్లి అప్పారావు, గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ, యువజన మరియు విద్యార్థి విభాగాల అధ్యక్షులు, జడ్పీటీసీలు, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న వైసిపి నేతలు

విపత్తుల నివారణపై అవగాహన అవసరం

-జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రజలందరూ విపత్తుల నివారణపై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ్ అన్నారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ వద్ద శుక్రవారం వివిధ శాఖల అధికారులు, సిబ్బంది మార్క్ డ్రిల్ నిర్వహించారు. విపత్తులు ఎదురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలను విన్యాసాల ద్వారా చేసి చూపించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణం చేపట్టాల్సిన నియంత్రణ చర్యలను వివరిస్తూ విపత్తు నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, ప్రమాదం జరిగిన సమయంలో సురక్షితంగా బయటకు రావడం, సురక్షిత ప్రాంతంలో ఉండటం, ప్రమాదంలో ఎవరైనా ఉంటే వారిని రక్షించేందుకు ఎటువంటి విధానాలను అనుసరించాలనే అంశాలను తల్లిదండ్రులకు, స్నేహితులకు, విద్యార్థులు వివరించాలన్నారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ 2005 చట్టం గురించి విద్యార్థులకు వివరించారు.

ఐటిడిఎ పిఒ శ్రీపూజ మాట్లాడుతూ..విపత్తు నివారణ మాక్ డ్రిల్ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు. ప్రకృతి విపత్తు సంభవిస్తే వివిధ ప్రభుత్వ శాఖలు సహాయం చేస్తాయని అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, జిల్లా విపత్తుల నిర్వహణ శాఖ నోడల్ అధికారి లోకేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జెసి

శతశాతం ఉద్యోగాలు ఇవ్వాల్సిందే..

- ఆదివాసీ సంఘాలు డిమాండ్
- స్పెషల్ డిఎస్సి కోసం పిఒకు వినతి

ప్రజాశక్తి -రంపచోడవరం : ప్రత్యేక డిఎస్‌సి సాధన కోసం, ఆదివాసీ నిరుద్యోగులు ఐటిడిఎ కేంద్రంగా, 3 రోజుల పాటు చేస్తున్న ఆందోళనలో శుక్రవారం ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజన సంఘం, ఆదివాసీ దండకారణ్య సమితి, ఏజెన్సీ గిరిజన సంఘం ప్రతినిధులు, ఆదివాసీ జెఎసి నిరుద్యోగులు ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పిఒతో మాట్లాడుతూ ప్రభుత్వం వంద శాతం ఉద్యోగాలు ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులకు ఇవ్వాలని, ఆ విధంగా ప్రభుత్వం నిర్ణయాన్ని తక్షణమే ప్రకటించాలని, అసలు ఆదివాసుల ఉద్యోగాలు ఆదివాసులకు ఇస్తారా ఇవ్వరా ప్రభుత్వం తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కాలయాపన చేయడం వల్ల ఆదివాసుల్లో ఆందోళన పెరుగుతుందన్నారు. పిఒ స్పందించి ప్రభుత్వానికి ఐటిడిఎ తరపున నివేదిక అందిస్తామని అధ్యయనం చేసి తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి మాట్లాడుతూ ఆదివాసీ నిరుద్యోగులు దశలవారీ పోరాటాలు నిర్వహించాలని దీనికి సిద్ధపడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రంపచోడవరం ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు సాధల విద్యాసాగర్‌రెడ్డి, దండకారణ్య విమోచన సమితి జిల్లా నాయకులు వంతు బాలకృష్ణ, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా నాయకులు పండుదొర, జెఎసి రాష్ట్ర కమిటీ సభ్యులు కారం రామన్నదొర, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు రమణ పాల్గొన్నారు. ఆదివాసీ నిరుద్యోగుల సంఘం, ఆదివాసి స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ నాయకులు ఎమ్.మురళీధర్, బి.రత్నాకర్, జి.లోవప్రసాద్, కె.రాజ్ కుమార్, ఎం. నిరంజన్, పి.వినీత, డివిజన్ నాయకులు రమణ, పిడిఎస్‌యు డివిజన్ అధ్యక్షులు దొరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పిఒ స్మరణ్‌రాజ్‌కు వినతిపత్రం అందిస్తున్న సాధనకమిటీ సభ్యులు

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

ప్రజాశక్తి -సీలేరు:

విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని జెఎసి చైర్మన్ వై.సత్తిబాబు, కన్వీనర్ ధారాజు స్పష్టం చేశారు. రాష్ట్ర జెఎసి నాయకుల పిలుపు మేరకు జికె వీధి మండలం సీలేరు ఎపి జెన్‌కో ఇఇ కార్యాలయం ముందు శుక్రవారం ఈ మేరకు రిలే దీక్షలు ప్రారంభించామని వారు తెలిపారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల పెన్షనర్ల కుటుంబ సభ్యులకు పూర్తి స్థాయిలో వైద్యఖర్చులు యాజమాన్యం భరించాల న్నారు. ఇపిఎఫ్‌ను జిపిఎఫ్‌గా మార్చి పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను విద్యుత్ సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు.

దశాబ్దాలు నుండి పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎ/ డిఆర్‌ను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ డిగ్రీ కలిగిన జూనియర్ ఇంజనీర్లకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించాలన్నారు. డిమాండ్లు నెరవేర్చే వరకూ జెఎసి ఆదేశాలకు అనుగుణంగా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జెన్‌కో విద్యుత్ ఉద్యోగులు భాస్కరరావు, సుకుమార్, రాంబాబు, సబ్‌ఇంజనీర్ శ్రీనివాస్ రిలే దీక్షలో పాల్గొన్నారు. ఎపి జెన్కో ఇంజనీర్లు కార్మికులు పాల్గొన్నారు.



రిలేదీక్షలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

రాజ్‌మా విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-సీలేరు:

రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన రాజ్మా చిక్కుళ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జికె వీధి మండల వ్యవసాయాధికారి గిరిబాబు కోరారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరి రైతులకు 32 క్వింటాలు విత్తనాలు ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. జికెవీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి బంధవీధి, కొమ్ములవాడ, కాట్రగెడ్డ, పిల్లిగెడ్డ, తదితర గ్రామాలకు చెందిన 304 మంది రైతులకు రాజ్‌మా విత్తనాలు శుక్రవారం పంపిణీ చేశామన్నారు. ఎంపిఇఒ రాజశేఖర్ సర్పంచ్ లేబుకుమారి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి గిరిబాబు



మార్కెట్‌యార్డ్ పరిశీలిస్తున్న మార్కెట్‌కమిటి చైర్మన్ లక్ష్మణరావు తదితరులు

మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి

- ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తానని మార్కెటింగ్ చైర్మన్ లోతా లక్ష్మణరావు అన్నారు. రాజవొమ్మంగి మండలం నుంచి రంపచోడవరం మార్కెట్ కమిటి చైర్మన్‌గా లోతా లక్ష్మణ్‌రావు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఎపిఐఐసి డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, రాజవొమ్మంగి సర్పంచ్ గొల్లపూడి రమణి, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు ఎం విజయభాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మార్కెట్ స్థలాన్ని ఆయనతో పాటు మార్కెట్ కమిటీ కార్యదర్శి కష్ణమోహన్ సందర్శించి తక్షణమే మార్కెట్‌యార్డ్ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి త్వరలోనే పూర్తిస్థాయి షెడ్లు, ఇతర భవనాలు వసతులు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎపిఐఐసి డైరెక్టర్ మండల పార్టీ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, సర్పంచ్ గొల్లపూడి రమణి, సొసైటీ అధ్యక్షుడు ముప్పన కేశవ, పెదిరెడ్ల సత్తిబాబు, ముప్పన మోహన్, జెట్టి మధు పాల్గొన్నారు.



జెసిబితో తొలగిస్తున్న చెట్టు

ధారకొండ రోడ్డులో కూలిన భారీ వృక్షం

ప్రజాశక్తి -సీలేరు: జిల్లాలోని ధారకొండ ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలింది. దీంతో కొంతసేపు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారికి ఇరువైపులా వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. జికెవీధి మండలం దారాలమ్మ ఆలయం మలుపు ముందు భారీవృక్షం శుక్రవారం ఉదయం కూలిపోయింది. అటుగా వస్తున్న విశాఖ నుంచి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే బస్సు భద్రాచలం నుంచి సీలేరు మీదుగా విశాఖపట్నంవెళ్లే బస్సుతోపాటు గుమ్మిరేవులు నుంచి నర్సీపట్నం వెళ్లే బస్ మధ్యాహ్నం రెండు గంటల వరకు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. వీటితోపాటు ఇతర వాహనాలు కూడా నిలిచిపోయాయి. ఎస్ఐ రవీంద్ర స్పందించి ఆర్‌అండ్‌బి అధికారులకు సమాచారం అందించారు. దీంతో జెసిబితో వృక్షాన్ని తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

త్వరితగతిన ఫిర్యాదుల పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న జెసి, పిఒ, అసిస్టెంట్ కలెక్టర్,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ్, ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్ కలసి సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులు త్వరితగతన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రణాళిక అధికారి పి.ప్రసాద్, జిల్లా పౌరసరఫరాల అధికారి వి.మోహన్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద, డిఇఒ పి.బ్రహ్మాజీ, డిపిఒ పిఎస్ కుమార్, టిడబ్ల్యు డిడి పిబికె పరిమళ, డిఆర్ డిఎ పిడి మురళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాట ఇచ్చి మోసం చేస్తారా..

వాలంటీర్ల సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: తమ సమస్యలను పరిష్కరించాలంటూ అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం వాలంటీర్లు ఆందోళనకు దిగారు. వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఐటిడిఎ ముందు మహా ధర్నా నిర్వహించారు. అంతకుముందు మోదకొండమ్మ ప్రాంగణం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల, సినిమా హాల్ సెంటర్ మీదుగా గ్రామ, వార్డు వాలంటీర్లు ర్యాలీగా ఐటిడిఎ గేటుకు చేరుకున్నారు. బైఠాయించి ధర్నా చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, సిఎం చంద్రబాబు వాలంటీర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన మహాధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో వాలంటీర్లకు అండగా ఉంటామని మాట ఇచ్చి ఇప్పుడు మోసం చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలామంది వాలంటీర్లు ఉద్యోగం లేకపోవడంతో ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వాలంటీర్లను ఆదుకుంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని విస్మరించడం అన్యాయమన్నారు. తక్షణమే వారిని పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందర్రావు, వాలంటీర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సత్యారావు, చిన్న, విజయ, పాడేరు మండల నాయకులు సురేష్ కుమార్, వాసు, సింహాచలం, కొండమ్మ, ముంచంగిపుట్టు మండల నాయకులు దేవా, కిరణ్, అరకు మండల బుచ్చన్న, ప్రసన్న, కృష్ణ, మాడుగుల మండల నాయకులు శోభన్ చిన్నారావు, హుకుంపేట మండల నాయకులు కొండబాబు వసంత, పెదబయలు మండల నాయకులు తాతబాబు, కృష్ణారావు, ఆయా మండలాల్లోని గ్రామ, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వాలంటీర్లు, నాయకులు

స్వచ్ఛందంగా బంగారు కుటుంబాల దత్తత

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి-పాడేరు:స్వచ్ఛందంగానే బంగారు కుటుంబాల దత్తత ఉంటుందని, మార్గదర్శి నిర్ణయమే ముఖ్యమని జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పి4 బంగారు కుటుంబాల దత్తతపై జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్డు సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బంగారు కుటుంబాల దత్తతకు మార్గదర్శకులు ముందుకు రావాలని కోరారు. ఇందులో ఎటువంటి ఒత్తిడి లేదని వారు స్వచ్ఛందంగా, ఇష్టపూర్వకంగానే రావచ్చని పేర్కొన్నారు.

అలాంటి వారినే మార్గదర్శిగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. మార్గదర్శులకు అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి జాయింట్ కలెక్టర్ సూచించారు. మార్గదర్శిల ఎంపికకు ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసిందని తెలిపారు. ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలు ఇలా అన్ని వర్గాల్లోని వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దత్తత తీసుకోవచ్చని పిలుపునిచ్చారు. మార్గదర్శులతో బంగారు కుటుంబాల్లో చిన్న మార్పు వచ్చినా వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తుందని జేసీ తెలిపారు. బంగారు కుటుంబాలకు సహాయ సహకారాలను అందించి మార్గదర్శి ఆదుకోవచ్చని, ఈ విషయంపై మార్గదర్శికి అవగాహన కల్పించి వారి పేర్లను పీ4లో నమోదు చేయాలని సూచించారు. ఒకరు ఎన్ని కుటుంబాలనైనా లేదా వారి స్తోమతను బట్టి గ్రామాలను కూడా దత్తత తీసుకోవచ్చని తెలిపారు.ఈ శిక్షణా తరగతుల కార్యక్రమంలో జిల్లా ప్రణాళికాధికారి పి.మురళీ, పి4 నోడల్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, అరకు నియోజక వర్గం స్పెషల్ ఆఫీసర్ లోకేశ్వరరావు, స్టేట్ లెవెల్ పి ఫోర్ అబ్జర్వర్, టెక్నికల్ పర్సన్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎం సర్పంచ్ దంపతుల ఔదార్యం



సాయం చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల తల్లిని కోల్పోయిన 4నెలల పసి బాబుకు మండలంలోని గసబ పంచాయతీ సిపిఎం సర్పంచ్ దంపతులు పాంగి సునీత, సురేష్ కుమార్ శుక్రవారం పాల డబ్బాలు, నగదు సహాయం అందించారు. గసబ గ్రామ పంచాయతీ, ముర్రిగూడ గ్రామానికి చెందిన పాంగి. బుచ్చులమ్మ రెండు వారాల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ దంపతులు కొంత సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.పాల డబ్బాలు నిమిత్తం రూ 5000లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్థిక సహాయాన్ని అందించిన మానవత్వ వాదులందరికి కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాంగి. దొరబాబు, రాజ్ కుమార్, సుబ్బారావు, పి కొత్త, గ్రామ పెద్దలు పాంగి. అగడ, కందపూల్, నకుల్, బిమో తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగుచేయరూ..?

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో వంతల పంచాయితీ వంతల గ్రామం నుండి బంగారు మెట్ట గ్రామం వరకు రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు. రహదారి నిర్మాణ పనులు మధ్యలో నిలిపివేయడంతో ఆయా గ్రామాల గిరిజనులు పీఎం జన్మన్ గృహాల నిర్మాణాలకు మెటీరియల్ తీసుకెళ్లే వాహనాలు బురదలో కూరుకువడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, రహదారి పనులు ప్రారంభించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు స్పందించి రహదారి పనులు పూర్తిస్థాయిలో కోరారు



మట్టిలో కూరుకు పోయిన వాహనం

పౌష్టికాహారంతో ఆరోగ్యం



హుకుంపేట, అనంతగిరిలో అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ సిబ్బంది



ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని గన్నేరు పుట్టు సచివాలయంలో ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి టీచర్ పార్వతి గర్భిణీలు, కిషోర బాలికలకు పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.గిరిజన ప్రాంతాల్లో పండే ఆకు కూరలు, కాయ కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు తినడంతో శరీరానికి అవసరమైన పోషకాలు లభిస్తాయన్నారు. దీంతో ఆరోగ్యంగా ఉండవచ్చు నన్నారు. చికుమద్దుల సర్పంచ్ బొంజు నందదొర మాట్లాడుతూ పిల్లలు, బాలికలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాకురు సూపర్వైజర్ జానకి, ఆశ కార్యకర్తలు అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరి: గర్భిణీలు, బాలింతలు పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని కాశీపట్నం సెక్టార్ సూపర్వైజర్ ఎస్ కే షకీల సూచించారు. అక్టోబర్ 16వ తేదీ వరకు మండలంలో పోషకాహార మసోత్సవాలు నిర్వహిస్తామని, ఇందులో భాగంగానే శుక్రవారం ఎన్ ఆర్ పురం పంచాయతీ బొంగిజా, చిమిడివలస నిర్వహించామని ఆమె తెలిపారు. గర్భిణీలు, బాలింతలు ఎటువంటి ఆహారం తీసుకోవాలో అవగాహన కల్పించారు. గర్భిణీలు చక్కెరతో పాటు ఉప్పు, నూనె తగ్గించి ఆహార పదార్థాలను తీసుకోవాలని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు నెంబర్ బి. రామయ్య ఎస్. కొండయ్య అంగన్వాడి కార్యకర్తలు కె. సింహాచలం జె. పోలమ్మ ఆశా కార్యకర్తలు ఎస్ .సన్యాసమ్మ. ఎస్సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి-జి.మాడుగుల: వాతావరణ పరిస్థితులు బట్టి ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిమాడుగుల ప్రాథమిక వైద్య అధికారి కిషోర్ కోరారు. శుక్రవారం మండలంలోని జిఎం కొత్తూరు, పాలమామిడి సచివాలయం గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలకు ప్రత్యేక వైద్యం అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి కిషోర్. స్థానిక సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపీటీసీ మత్స్య రాస విజయ్ కుమారి, వైద్యురాలు ఇందిరా, ఆరోగ్య విస్తరణ అధికారి నడిగట్ల ప్రకాష్. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జయరాజు

ప్రజాశక్తి-హుకుంపేట : పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు ఎంతో ముఖ్యమని జిల్లా పశుసంవర్ధక అధికారి వి. జయరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని గడుగుపుట్టు. పాటి మామిడి గ్రామాలలో గాలి కుంటు వ్యాధి టీకాల కార్యక్రమం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, పశువుల ఆరోగ్యం కాపాడటంలో టీకా ఎంతో కీలకమని, ప్రతి రైతు వేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పశువులకు సమయానికి టీకాలు వేయడంతో వ్యాధులు రాకుండా నిరోధించగలమని తెలిపారు.రైతులు నష్టాల నుండి తప్పించుకోవచ్చని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న వెటర్నరీ సిబ్బంది

పార్కుకు ఆట వస్తువుల వితరణ

ప్రజాశక్తి -మధురవాడ: జివిఎంసి ఆరోవార్డు సంపత్ నగర్ పార్కుకు చిప్పాడ దివిస్ కంపెనీ తన సిఎస్ఆర్ నిధులతో పిల్లల ఆట వస్తువులు, సిమెంట్ బల్లలు సమకూర్చింది. టిడిపి యువనేత గంటా రవితేజ వీటిని ప్రారంభించారు. సంపత్ నగర్ పార్కు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దివిస్ జనరల్ మేనేజర్ పున్నారావు, డిజిఎం పి జగదీష్, సి ఎస్ ఆర్ మేనేజర్ డి సురేష్ కుమార్, స్థానిక నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.



రైతులకు యూరియా అందిస్తున్న ప్రజాప్రతినిధులు

యూరియా కోసం ఆందోళన చెందొద్దు


ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రైతులెవ్వరూ యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సొసైటీ అధ్యక్షులు ముప్పన డింబకేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు తదితరులు అన్నారు. మండలంలో 35 టన్నులు యూరియా సిద్ధంగా ఉందన్నారు. మండలానికి శుక్రవారం 35 టన్నులు యూరియా వచ్చిందని రాజవొమ్మంగి సొసైటీ గిడ్డంగిలో 25 టన్నుల యూరియా సిద్ధంగా ఉందని సొసైటీ చైర్మన్ ముప్పన కేశవ్ వెల్లడించారు. మండలానికి సరిపడా యూరియా ఉందని మండల టిడిపి ప్రధాన కార్యదర్శి, సొసైటీ చైర్మన్ ముప్పనకేశవ్ తెలిపారు. శుక్రవారం సొసైటీ వద్దకు వచ్చిన రైతులకు కేశవ్ యూరియా అందజేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, సొసైటీ మెంబర్ విషంశెట్టి చిట్టెమ్మ పాల్గొన్నారు.



డస్ట్‌బిన్స్ అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

ఆదిసేవా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: లాగరాయి పంచాయతీ లాగరాయి గ్రామంలో శుక్రవారం ఆదికర్మ యోగి అభియాన్‌లో భాగంగా ఆదిసేవా కేంద్రాన్ని సర్పంచ్ మిరియాల గణలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు 300 డస్ట్‌బిన్ బకెట్లు అందజేశారు. వార్డు సభ్యులు, కూటమి నాయకులు బొడ్డు వెంకటరమణ, జీరెడ్డి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నాగేశ్వరావును పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

మేకల నాగేశ్వరావుకి సతీ వియోగం

ప్రజాశక్తి-కూనవరం: సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు భార్య అచ్చుమ్మ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధ పడుతున్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ నాయకులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. నాగేశ్వరావు కుటుంబానికి సానుభూతి తెలియజేసారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, సున్నం రాజులు, సిపిఎం ఎఎస్ఆర్ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు లోతా రామారావు, పాయం సీతారామయ్య, పంకుసత్తిబాబు,శ్రీరామ్మూర్తి, సర్పంచ్ శంకర్, రామారావు, వెంకమ్మ, నానుపల్లి వెంకటేశ్వరావు తదితరులు పరామర్శించారు.

ఏజెన్సీలో పిఒ ఆకస్మిక పర్యటన

ఆశ్రమపాఠశాలలు, పలు కార్యాలయాలు, పిహెచ్‌సి పరిశీలన

ప్రజాశక్తి - మారేడుమిల్లి: మండల కేంద్రంలో ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. గిరిజన బాల బాలికల ఆశ్రమ పాఠశాలలను, అంగన్‌వాడి కేంద్రాన్ని, మండల పరిషత్ కార్యాలయాన్ని, తహశీల్దార్ కార్యాలయాన్ని, పిహెచ్‌సిని పరిశీలించారు. ముందుగా గిరిజన సంక్షేమ శాఖ బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించి ఎంతమంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు అనేది ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడి కేంద్రంలో ఎంతమంది బాలబాలికలు, గర్భిణులు ఉన్నదీ ఆరా తీశారు. పిహెచ్‌సి పరిశీలించి మందుల కొరత లేకుండా చూడాలని జ్వరాలతో ఆసుపత్రికి వచ్చిన వారికి వెంటనే రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాన్ని పరిశీలించారు. అంతకుముందు గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల లో విద్యార్థులతో పిఒ భోజనం చేశారు. ఆయన వెంట తహశీల్దార్ బాలాజీ, ఎంపిడిఒ మడకం రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రమ బాలుర పాఠశాలలో విద్యార్థులతో భోజనం చేస్తున్న పిఒ

అర్హత కలిగిన విద్యావంతులకు ఉపాధి కల్పించాలి: రాజ్ కుమార్‌రెడ్డి

మండల పర్యటనలో భాగంగా పిఒ స్మరణ్‌రాజ్‌ను సెంటర్ ఫర్ ట్రైబల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన విద్యావంతులకు ఉపాధి కల్పించాలని కోరారు. మండలంలో లీజు పేరుతో భూములు తీసుకుని తరువాత మా భూమి అని కేసులు పెట్టి కోర్టు నోటీసులు పంపిస్తున్నారని దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండల పరిధిలో మొత్తం రీ సర్వే చెయ్యాలని కోరురు సిటిఆర్ సంస్థ సభ్యులు కోండ్ల విజయసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిర్చి నాట్లు వేసేందుకు రైతుల ఎదురుచూపు

ప్రజాశక్తి - విఆర్‌పురం: మండలంలో మిర్చి నాట్లు వేయాల్సిన సమయం వచ్చినా ఇటీవల వచ్చిన వరదలతో బురదమయం అయిపోవడంతో నాట్లు వేయలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శబరిలంకలు, విఆర్ పురం, వడ్డుగూడెం, చింతరేవుపల్లి శ్రీరామగిరి, సీతంపేట, జీడిగుప్ప, పోచారం, చొక్కనపల్లి తదితర గ్రామాల్లో నాట్లు వేయాల్సి ఉంది. అయితే వరదల వల్ల వీలు కుదరలేదు. ఇప్పటికైనా వర్షాలు, వరదలు తగ్గితే నాట్లు వేయాలని రైతులు ఎదురు చూస్తున్నారు.



బురదమయమైన పొలాలు

వెయ్యి మంది 'గీతం' విద్యార్థుల రక్తదానం

ఎన్‌సిసి ఆధ్వర్యాన రక్తదాన శిబిరానికి స్పందన : భాగస్వాములైన అధ్యాపకులు



రక్తదానం చేస్తున్న గీతం విద్యార్థులు, అధ్యాపకులు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గీతంలోని శివాజి ఆడిటోరియం, మదర్‌థెరిసా ఆడిటోరియం, నాలెడ్జి రీసోర్సు సెంటర్లలో వెయ్యి మందికి పైగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు బారులుదీరి, ఉత్సాహంగా స్వచ్ఛంద రక్తదానం చేశారు. ఎన్‌టిఆర్ బడ్ బ్యాంక్, ఎ.ఎస్.రాజా వాలంటీరు బ్లడ్ బ్యాంక్, రోటరీ క్లబ్ బ్లడ్ బ్యాంక్, మథర్ బ్లడ్ బ్యాంక్, జిమ్‌సర్ బ్లడ్ బ్యాంక్‌ల నిపుణులు పాల్గొని విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు.

ఈ సందర్భంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, గీతం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌విజి.రెడ్డి మట్లాడుతూ అత్యవసర పరిస్థితి ఉన్న వారికి ఏటా 14.6 మిలియన్ యూనిట్ల రక్తం అవసరమని, సరైన సమయంలో రక్తం లభించక ఏటా 12 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. స్వచ్ఛంద రక్తదానంతోనే సరిపడా రక్తసేకరణ సాధ్యమన్నారు. భారీసంఖ్యలో యువత స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్ బ్లెడ్ బ్యాంక్ డాక్టర్లు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ కె.సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- రంపచోడవరం : 11 కె.వి రంపచోడవరం ఫీడర్, 33 కెవి మారేడుమిల్లి ఫీడర్ 11కెవి ఇందుకూరుపేట ఫీడర్ నందు ఫ్రైడే మైంటెనెన్సులో భాగంగా లైన్ల మరమ్మతులు ట్రీ ట్రిమ్మింగ్ నిర్వహిస్తున్నందున రంపచోడవరం, సిరిగిందలపాడు, మారేడుమిల్లి మండలం పరిసర ప్రాంతాలకు, గంగవరం మండలం పెదగార్లపాడు నుండి మొల్లేరు వరకూ ఉన్న గ్రామాల్లో దేవీపట్నం మండలం ఉప్పయ్యపాలెం నుంచి శరభవరం పరిసర ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని కావున వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గాబ్రియేల్ తెలిపారు.

కార్పొరేటర్ల అధ్యయన యాత్ర నివేదిక ఇవ్వండి

ప్రజాశక్తి -ఎంవిపికాలనీ:జివిఎంసి కార్పొరేటర్లు అధికారులు గత మూడేళ్లుగా నిర్వహిస్తున్న అధ్యయన యాత్రలపై నివేదికలు వెల్లడించడం లేదని మళ్లీ నాలుగోసారి యాత్రకు వెళ్లారని ప్రసారమాధ్యమాల ద్వారా తమకు తెలిసిందని ఈ సారైనా యాత్ర యొక్క నివేదికను బహిరంగపరచాలని వార్వా-నివాస్ కార్యదర్శులు బిబి గణేష్, పిట్ట నారాయణమూర్తి శుక్రవారం జివిఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటివరకూ ఏ యాత్రకు సంబంధించిన వివరాలూ కౌన్సిల్‌లో చర్చకు పెట్టలేదన్నారు. ఈ మెగాటూర్‌కు అయ్యే ఖర్చులను నివాసితుల నుండి వసూలు చేస్తున్న ఆస్తిపన్ను నుండి భరించాల్సి వస్తోందని ఇటువంటి దుర్వినియోగం అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.

హెచ్‌పిసిఎల్‌లో ప్రమాదం

కంప్రెసర్ షెడ్‌లో గ్యాస్ లీకేజీ : పరుగులు తీసిన కార్మికులు

ప్రజాశక్తి- ములగాడ : హెచ్‌పిసిఎల్ విశాఖ రెఫైనరీ విస్తరణ పనుల్లో భాగంగా రఫ్ ప్లాంట్ మెయింటినెన్స్ పనుల్లో టెస్టింగులు జరుగుతుండగా హైడ్రో కంప్రెసర్ వద్ద పైపులైన్ ప్లాజు వద్ద గ్యాస్ లీకేజీతో శుక్రవారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది,ఉదయం తొమ్మిది గంటలకు కార్మికులు విధుల్లోకి చొరబడుతుండగా ప్రమాదంతో కార్మికులందరూ భయంతో పరుగులు తీశారు, వెంటనే సంస్థ అధికారులు అగ్నిమాపక శకటాలతో అక్కడకు చేరుకుని అదుపు చేశారు, విషయం తెలుసుకున్న మల్కాపురం సిఐ గొలగాని అప్పారావు, తహశీల్దార్ రమేష్‌నాయుడు, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డ్ ఎఇ ముకుందరావు తదితరులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదని, ప్రజలు భయాందోళన చెందక్కర్లేదని సంస్థ అధికారులు వెల్లడించారు. పారిశ్రామిక ప్రాంతంలో వరస ప్రమాదఘటనలతో స్థానికులు భీతిల్లుతున్నారు.

పెదగంట్యాడలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ వద్దు

ప్రజాశక్తి-గాజువాక : ఆదానీ గంగవరం పోర్టు యాజమాన్యం పెదగంట్యాడ శివారులో సిమెంట్ గ్రేండింగ్ యూనిట్ ఏర్పాటు ప్రక్రియను తక్షణమే నిలిపేయాలని డిమాండ్ చేస్తూ, శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రతిపాదిత ప్రాంతంలో నిరసన చేపట్టారు . ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గంగవరం పోర్టు పుణ్యమాని ఇప్పటికే పెదగంట్యాడ, గంగవరం, గాజువాక ప్రాంతాలు కాలుష్యం బారినపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇపుడు 20 ఎకరాల విస్తీర్ణంలో కాలుష్య కారకమైన అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే గాజువాక జోన్‌లోని ఏడు వార్డుల ప్రజల ఆరోగ్యం, వారి జీవన మనుగడ ప్రశ్నార్థకంగా మారుతందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రతిపాదన విరమించుకోవాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కె. వనజాక్షి, నాయకులు జి. ఆనంద్, పల్లేటి పోలయ్య, కె. అచ్యుతరావు, పి. దుర్గారావు, కె. పోతయ్య, గణేష్ , పిల్లా పద్మ పాల్గొన్నారు.

మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ప్రజాశక్తి- ఆనందపురం: మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సత్యసాయి సేవా సంస్థలు రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణనిస్తున్నాయని స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ మహిళా కోఆర్డినేటర్ బి. అమ్మాజీ తెలిపారు. శుక్రవారం గొట్టిపల్లి సత్యసాయి ఇంటిగ్రేటెడ్ సేవా మందిరంలో 55 మంది మహిళలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌పై 40 రోజుల ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. సత్యసాయి ప్రతినిధులు ఆర్‌వి. నాయుడు, కె.ఈశ్వరి, బి.సాయికుమార్, టివివి. సత్యనారాయణ, జి.అపర్ణ, సత్యసాయి కుమార్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.